India Media Monitor

# Eenadu

## Every five years something new in business

Date: 21/12/2013 | Edition: Hyderabad | Page: 8 | Source: Bureau | Clip size (cm): W: 17 H: 17

Clip: 1 of 1

# ప్రతి అయిదేళ్లకు వ్యాపారంలో కొత్తదనం

## అప్పుడే విజయవంతం ● టై సదస్సులో మైండ్‌ట్రీ ఛైర్మన్ సుబ్రతో బాగ్చి

ఈనాడు - హైదరాబాద్

వ్యాపారసంస్థ నిర్వహణలో ప్రతి అయిదేళ్లకు కొత్తదనం చూపితే విజయవంతం అయ్యే అవకాశాలు అధికం అని ఐటీ సేవల సంస్థ మైండ్‌ట్రీ ఛైర్మన్ సుబ్రతో బాగ్చి చెప్పారు. హైదరాబాద్ అంతర్జాతీయ సమావేశ కేంద్రం (హెచ్ఐసీసీ)లో టై ఎంట్రప్రెన్యూర్ సదస్సు 2013 చివరిరోజు కార్యక్రమంలో ఔత్సాహికులకు ఆయన పలు సూచనలు చేశారు. ఉత్పత్తి/సేవల్లో, సరఫరా విధానాల్లో మార్పులతో కొత్త ఖాతాదారులను ఆకర్షించవచ్చని చెప్పారు. డబ్బు, వస్తువులు నష్టపోయినా, సిబ్బంది మారినా ఫరవాలేదు కానీ, ఒకసారి వినియోగదారుల్లో విశ్వాసం కోల్పోతే, కోలుకోవడం అసాధ్యమని పేర్కొన్నారు. సంస్థకు సంబంధించిన అంశాలపై యజమానులతో పాటు సిబ్బందికీ అవగాహన పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని, సంస్థ/వ్యాపారం వృద్ధికి చిత్తశుద్ధితో నూరుశాతం శ్రమించాలని వివరించారు.

### అంతర్జాతీయ ప్రాచుర్యం సాధిస్తాం

తమ సంస్థ అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు సుబ్రతో బాగ్చి చెప్పారు. ఆయా దేశాల్లో అక్కడి వారినే సిబ్బందిగా నియమించడమే కాక, సంస్థ ఉండటం వల్ల మేలు కలుగుతుందని స్థానికులు భావించేలా కార్యకలాపాలు నిర్వహిస్తామని తెలిపారు. కంపెనీ నాయకత్వాన్ని వారసత్వంగా నిర్ణయించబోమని, నిర్వహణ బాధ్యతలను అర్హతల మేరకే అప్పగించాలన్నది యోచనగా వివరించారు. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఏడాది మెరుగైన ఆర్థిక ఫలితాలు నమోదు చేస్తామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

### సాంకేతికతను సమర్థంగా వినియోగించాలి: ప్రామాణిక్

సంస్థ నిర్వహణ - అభివృద్ధిలో సాంకేతికతను సమర్థంగా నిర్వహించాలని మైక్రోసాఫ్ట్ ఇండియా ఛైర్మన్ భాస్కర్ ప్రామాణిక్ చెప్పారు. మొబిలిటీ, సామాజికసైట్లు, బిజినెస్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ వంటివి సంస్థ నిర్వహణలో కీలకపాత్ర పోషించబోతున్నాయన్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక సైట్లు వ్యక్తిగత అనుబంధం, అభిప్రాయాలు పంచుకోవడంతో పాటు వ్యాపార నిర్వహణ, అమ్మకాల్లోనూ ప్రభావం చూపే స్థాయికి చేరాయని గుర్తించాలన్నారు. ఖాతాదారులను ఎంగేజ్ (నిమగ్నం) చేసుకోవడం, కొత్త నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవడం, వినూత్న సేవలు-ఉత్పత్తుల ఆవిష్కరణకు సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. 6 నెలల్లో 100 వాణిజ్య అప్లికేషన్ల (యాప్స్) రూపకల్పన లక్ష్యంగా స్వతంత్ర సాఫ్ట్‌వేర్ విక్రయదార్లు, ప్రారంభ సంస్థలకు పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాపార, వాణిజ్య సంస్థలకు, ప్రభుత్వ, వ్యక్తిగత వినియోగానికి ప్రత్యేక యాప్స్ తయారు చేయాలని, 56 ప్రభుత్వ విభాగాలు అందుబాటులో ఉంచిన డేటా సెట్స్‌ను ఇందుకు వాడుకోవచ్చని చెప్పారు.



శుక్రవారం హెచ్ఐసీసీలో టై సదస్సులో పాల్గొన్న మైండ్‌ట్రీ ఛైర్మన్ సుబ్రతో బాగ్చి, మైక్రోసాఫ్ట్ ఇండియా ఛైర్మన్ భాస్కర్ ప్రామాణిక్